# VC NEWS వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ ఆదివారం 21 సెప్టెంబర్ 2025

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:03 సంచిక: 42

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


# తీరొక్క పూవై.. గౌరమ్మ కొలువై

హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో శనివారం బతుకమ్మ వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం అమావాస్య నాడు సంబరాలకు శ్రీకారం చుట్టనుండగా.... ఇక్కడ మాత్రం ఒకరోజు ముందే నిర్వహించడం ఆనవాయితీ. స్థానిక మహిళలు తీరొక్కపూలతో బతుకమ్మలను పేర్చి హనుమాన్ దేవాలయం వద్ద ఆడి..పాడారు.





## విదేశాలపై ఆధారపడడమే పెద్ద తప్పు

### అదే మనకు అతిపెద్ద శత్రువు

**విదేశాలపై ఎంతగా ఆధారపడితే అంతగా విఫలం అవుతాం**

**ట్రంప్ వీసా ఛార్జీలపై ప్రధాని మోడీ పరోక్ష హెచ్చరిక**

గాంధీనగర్: హెచ్ 1బీ వీసాలపై అమెరికా అధ్యక్షుడు లక్ష డాలర్ల దరఖాస్తు రుసుము విధించటంపై భారత ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. ఈ మేరకు శనివారం ట్రంప్ నిర్ణయంపై కీలక వ్యాఖ్యలు చేశారు. విదేశాలపై ఆధారపడటమే అన్నింటికన్నా పెద్ద శత్రువని మోదీ పేర్కొన్నారు. విదేశాలపై ఆధారప డొద్దని తాను ఎప్పటినుంచో చెబుతున్నానన్నారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. 'మనమంతా కలిసి ఆ శత్రువును జయించాల్సిన అవసరం ఉంది. విదేశాలపై మనం ఎంతగా ఆధారపడితే మన దేశం అంతలా విఫలం అవుతుంది. మనమంతా కలిసి భారత్‌ను ప్రపంచంలోనే బలమైన ఆర్థిక వ్యవస్థలా మార్చాలి. ఇతరులతో కలిసి నడుద్దాం కానీ, ఆత్మాభిమానంతో

-2వ పేజీలో



# హెచ్-1బీ పిడుగు

అమెరికాలో ఉద్యోగం చేద్దామని కలలు కంటున్న భారతీయులు సహా ప్రపంచంలోని వివిధ దేశాల వారికి పిడుగులాంటి వార్త. హెచ్-1బీ వీసాల వార్షిక దరఖాస్తు రుసుమును లక్ష డాలర్ల (సుమారు రూ.88 లక్షలు)కు పెంచుతూ ట్రంప్ యంత్రాంగం సంచలన నిర్ణయం తీసుకుంది. ఈ భారీ పెంపునకు సంబంధించిన కార్యనిర్వాహక ఉత్తర్వులపై అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం సంతకాలు చేశారు. భారత్‌లో, అందునా తెలుగు రాష్ట్రాలను తీవ్రంగా ప్రభావితం చేసే ఈ నిర్ణయం ఈ నెల 21 నుంచి ఒక ఏడాది పాటు అమల్లో ఉండనుంది. ఇది భారత్‌నే కాదు.. చైనా సహా పలు దేశాలనూ ప్రభావితం చేయనుంది. వార్షిక ఫీజు పెంపుతో ఉద్యోగులతో పాటు టెక్ కంపెనీలూ తీవ్ర ఆందోళనకు గురవుతున్నాయి. ఇతర దేశాల్లో ఉన్న హెచ్-1బీ వీసాదారులు తక్షణమే అమెరికాకు తిరిగి రావాలని ఇమ్మిగ్రేషన్ అటార్నీలు సూచనలు జారీచేస్తున్నారు.

వార్షిక వీసా ఫీజు లక్ష డాలర్లకు పెంపుఅమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన నిర్ణయంభారత ఐటీ ఉద్యోగులపై పెను ప్రభావంటెక్ కంపెనీల్లో కలవరం తక్షణం యూఎస్‌కు వచ్చేయాలంటూ ఉద్యోగులకు ఈ మెయిళ్లు దీంతో విమానాశ్రయాల్లో రద్దీ భారీగా పెరిగిన విమాన టికెట్ రేట్లుఈ నిర్ణయం కొత్త వీసాదారులకు మాత్రమేవివరణ ఇచ్చిన వైట్‌హౌస్ ఈగందరగోళాన్ని అమెరికా పరిష్కరిస్తుందని భావిస్తున్నాం: భారత్

భారత కాలమానం ప్రకారం వీరంతా ఆదివారం ఉదయం 9.30 గంటలకల్లా అమెరికా చేరుకోవాలని, లేకపోతే.. పెంచిన హెచ్-1బీ వార్షిక ఫీజు ప్రకారం రూ.88 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని వార్తలు రావడంతో అగ్రరాజ్యానికి వెళ్లే విమానాల కోసం హెచ్-1బీ వీసాదారులు భారీస్థాయిలో విమానాశ్రయాలకు చేరుకుంటున్నారు. మరోవైపు అమెరికాలో అలజడి రేగుతోంది. పండుగలకు భారత్ వెళ్లాలనుకొనే వారు తమ ప్రయాణాలను రద్దు చేసుకుంటున్నారు. విమానాలు ఎక్కిన వారు కూడా దిగిపోతున్నారు. లక్ష డాలర్ల ఫీజు పెంపుపై అయోమయం నెలకొనడంతో వైట్‌హౌస్ వివరణ ఇచ్చింది. కేవలం కొత్త వీసాదార్లకు మాత్రమే ఈ ఫీజు వర్తిస్తుందని తెలిపింది. "నైపుణ్యమున్న అంతర్జాతీయ ఉద్యోగులను తీసుకొనే సంస్థలు ఏటా ప్రతి ఉద్యోగికి ఈ వీసా ఫీజు కింద ఆరు సంవత్సరాల వరకు లక్ష డాలర్లు చెల్లించాలి. ఈ ఫీజు కొత్త దరఖాస్తుదారులకు మాత్రమే వర్తిస్తుంది" అని వైట్‌హౌస్ ప్రతినిధి తెలిపారు.




## ఓట్ల చోరీకి.. బోగస్ ఓట్లకు తేడా తెలియదు

**శ్యామ్ పిట్రోడా డైరెక్షన్ వల్లే ఈ సమస్య**

**రాహుల్ తీరుపై మండిపడ్డ రామచంద్రరావు**

**రేవంత్‌కు కిషన్ రెడ్డి ఫోబియా పట్టుకుందని ఎద్దేవా**

## సీఎం నిర్లక్ష్యంతోనే పక్క రాష్ట్రాలకు తెలంగాణ జలాలు

**నిజానికి వెళితేగిలితే రేవంత్ బయటకు వెళతారేమోనని అన్నారు. కాళేశ్వరం అంశంలో తప్ప మాజీ మంత్రి హరీష్ రావుపై తనకు వేరే కోపం లేదని, ఇరిగేషన్ పై 2016 లోనే బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసింట్ కెటిఆర్ కు సూచించానని అన్నారు. నేరుగా సిఎంకే ఫైళ్లు వెళ్తున్నాయని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసింట్ కెటిఆర్ కు చెప్పానని తెలిపారు.**




**కాంగ్రెస్‌లోకి వెళ్లే ఆలోచన లేదు**

**కొత్త పార్టీపైనా ఇప్పుడే నిర్ణయం తీసుకోలే**

**ఇరిగేషన్‌పై గతంలోనే కెటిఆర్‌ను హెచ్చరించా**

**ఆల్మట్టిపై సిఎం పెదవి విప్పాల్సిందే**

**రాజకీయాల్లో తొక్కుకుంటూ ముందుకు పోవాల్సిందే**

**మీడియా సమావేశంలో జాగృతి అధ్యక్షురాలు కవిత**

హైదరాబాద్: సుప్రీం కోర్టు స్టే ఉన్నప్పటికీ ఆల్మట్టి ఆనకట్ట ఎత్తు పెంచేందుకు కర్ణాటక సిద్ధమైందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తెలిపారు. ఆల్మట్టిపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సుప్రీంకోర్టుకు వెళ్లాలని అన్నారు. ఈ సందర్భంగా కవిత మీడియాతో మాట్లాడుతూ..ప్రభుత్వం వెళ్లకుంటే జాగృతి తరపున సుప్రీంకోర్టును ఆశ్రయిస్తానని, మహారాష్ట్ర ఇప్పటికే స్పందించి కోర్టును ఆశ్రయిస్తామని ప్రకటించిందని తెలియజేశారు. ఆల్మట్టి ఎత్తు పెంచితే కృష్ణాలో క్రికెట్ ఆడుకోవడం తప్ప ఏమీ ఉండదని రేవంత్ ప్రభుత్వానికి చురకలంటించారు. పదేళ్లలో ఆర్డిఎస్ తుమ్మిళ్ల, పాలమూరు- రంగారెడ్డి పూర్తి చేసుకోలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. సిఎం రేవంత్ రెడ్డి కూడా కృష్ణా -ట్రైబ్యునల్ విచారణకు వెళ్లాలని సూచించారు. బిఆర్ఎస్ పార్టీ, మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు, సంతోష్ సోషల్ మీడియా తన పైనే దాడి చేస్తున్నాయని, సోషల్ మీడియాలో తనపై దాడిని ప్రజలు గమనిస్తున్నారని కవిత పేర్కొన్నారు. బిసి రిజర్వేషన్లపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోతే నిరసనలు తెలుపుతామని, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశానని..ఆమోదించాలని ఛైర్మన్ ను కోరానని చెప్పారు. ఫోన్ ద్వారా కూడా తన రాజీనామాను తెలియచేశానని అన్నారు. ప్రజాస్వామ్యంలో ఎన్ని పార్టీలు ఉంటే అంత మంచిదని,

ప్రజాస్వామ్యంలో కొత్త పార్టీలు వస్తే స్వాగతిస్తామని చెప్పారు. తనతండ్రి పార్టీ పెట్టేప్పుడు కూడా అనేకందిని సంప్రదించారని, తానూ అదే చేస్తున్నానని అన్నారు. తండ్రి పార్టీ నుంచి బహిష్కరణకు గురైన కూతురిని తానేనని అన్నారు. ఆదివారం చింతమడకలో జరిగే బతుకమ్మ వేడుకల్లో పాల్గొంటానని స్పష్టం చేశారు. కాంగ్రెస్ లోకి వెళ్లాలన్న ఆలోచన తనకు లేదని, కాంగ్రెస్ పెద్దలు ఎవరూ నన్ను తనను సంప్రదించలేదని అన్నారు.



## యువత ఆకాంక్షలు విస్మరిస్తే తస్మాత్ జాగ్రత్త

**హైదరాబాద్:** యువత ఆకాంక్షలను ప్రభుత్వాలు విస్మరిస్తే, ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఉద్యమా లు వచ్చే ప్రమాదం ఉందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కె.టి. రామారావు హెచ్చరించారు. దేశ యువత ఆకాంక్షలు ఆకాశాన్ని తాకుతుంటే, పాలకుల ఆలోచనలు మాత్రం పాకిస్థాన్, బంగ్లాదేశ్‌ల చుట్టూనే తిరుగుతున్నాయని విమర్శించారు. ప్రజల మౌలిక భావోద్వేగాలను రెచ్చగొడుతూ, మందిర్-మసీద్, ఎవరు ఏం తింటున్నారు.. ఎవరేం కట్టుకుంటున్నారన్న అంశాలపై ప్రజల దృష్టిని మళ్లించడంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విజయం సాధించారని ఆరోపించారు. దేశ భవిష్యత్తుకు కీలకమైన అభివృద్ధి, ఆవిష్కరణలను మోడీ గాలికొదిలేశారన్నారు. చైనా, జపాన్, అమెరికా వంటి పశ్చిమ దేశాలతో పోటీ-పడి వారిని అధిగమించే ప్రయత్నం చేయాలే తప్ప, మనకన్నా వెనుకబడిన దేశాలతో పోల్చుకుని సంతృప్తి చెందడం సరికాదని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో చురుగ్గా ఉండే యువత, రాజకీయాల్లోకి కూడా రావాలని కెటిఆర్ చెప్పారు. రాజకీయాలు యువత భవిష్యత్తును నిర్ణయిస్తున్నప్పుడు, యువత ఎందుకు రాజకీయాలను నిర్ణయించలేరు.. అని యువతకు పిలుపునిచ్చారు. ప్రపంచం అంతా ముసలితనంలో ఉంటే భారతదేశం మాత్రం యవరక్తంతో ఉరకలెత్తుతోందని అన్నారు. ఈ యువశక్తిని దేశ నిర్మాణానికి వాడుకోవడంలో పాలకులు విఫలమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 1985లో చైనా, భారత ఆర్థిక వ్యవస్థలు దాదాపు సమానంగా ఉండేవని, అప్పుడు చైనా తలసరి ఆదాయం 300 డాలర్లు అయితే మనది 500 డాలర్లు అని పేర్కొన్నారు. కానీ, 40 ఏళ్ల తర్వాత చూస్తే, ఇండియా ఆర్థిక వ్యవస్థ 4 ట్రిలియన్ డాలర్లకే పరిమితం అయితే, చైనా 20 ట్రిలియన్ డాలర్లకు ఎదిగిందని వివరించారు. ఇప్పుడు చైనా తలసరి ఆదాయం 13,000 డాలర్లు అయితే మనది కేవలం 2,700 డాలర్లే అని పేర్కొన్నారు.



## ఐదేళ్లలో కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం

హైదరాబాద్: కోటీశ్వరులను చేసేవిధంగా ప్రభుత్వ కార్యక్రమాలు ఉన్నాయని తెలంగాణ డిప్యూటి సిఎం భట్టివిక్రమార్క తెలిపారు. మహిళలు కోసం ఉచిత బస్సు సౌకర్యం కల్పించామన్నారు. హైదరాబాద్ లో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భట్టి విక్రమార్క హాజరయ్యారు. హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో జరిగిన ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలోమంత్రులు సీతక్క, వివేక్, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్లలో కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయడం తమ లక్ష్యమని, మహిళలను ఇప్పటికే 150 ఆర్టిసి బస్సులకు యజమానులను చేశామని తెలియజేశారు. మరో 450 ఆర్టిసి బస్సులకు మహిళలను యజమానులను చేయబోతున్నామని, మహిళలు ఇక వడ్డీవ్యాపారుల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణం కోసం ప్రభుత్వం ఇప్పటి వరకు రూ. 7,422 కోట్లు- చెల్లించిందని, 96 లక్షల కుటు-ంబాలకు సన్నబియ్యం అందించామని అన్నారు. 41 వేల రేషన్ కార్డులు ఇచ్చామని, వడ్డీలేని రుణాలతో

**కాంగ్రెస్ పార్టీ అంటేనే పేదల సంక్షేమాన్ని కోరే పార్టీ. ఇందిరమ్మ కాలంలోనే మహిళా సంక్షేమానికి పెద్దపీట వేశారు. ఉక్కుమహిళగా నిలిచిన ఇందిరా గాంధీ, తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియమ్మ - ఇద్దరూ మహిళల సాధికారతకు ప్రతీకలని అన్నారు.గతంలోనే కాంగ్రెస్ ప్రభుత్వ ఆధ్వర్యంలో మహిళా సంఘాలు ఏర్పడ్డాయి. నేడు ప్రతి ఏడాది 25 వేల కోట్ల బ్యాంకు రుణాలు మహిళలకు ఇస్తున్నాం. ఆ రుణాలతో మహిళలు పెట్రోల్ బంకులు, శక్తి క్యాంటీ-న్లు, సోలార్ ప్లాంట్లు- ఏర్పాటు- చేస్తున్నారు.**

మహిళలు వ్యాపారాలు చేయాలని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మహిళలు మహారాణులుగా ఉండాలనే సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి సీతక్క అన్నారు. గతంలో డబ్బుల కోసం మగవారిపై ఆధారపడే పరిస్థితి ఉండేది. మహిళలు ఆర్థికంగా బలపడేలా ప్రభుత్వం ప్రత్యేక పథకాలు తీసుకువచ్చింది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాం. మహిళలకు కుట్టుమిషన్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లు ఏర్పాటు- చేశాం. గ్రామీణ ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ మహిళా సంఘాలకు అప్పగించాం. సీఎం రేవంత్ రెడ్డి మహిళలకు పెద్దపీట వేశారు. ఉచిత బస్సు సౌకర్యం అందిస్తుంటే.. భారత రాష్ట్ర సమితి ఈ పథకాన్ని అగౌరవపరుస్తూ మహిళలపై విమర్శలు చేస్తోందని మంత్రి సీతక్క అన్నారు. మహిళల సంక్షేమం, సాధికారత పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, వివేక్‌ల సహకారంతో తెలంగాణ మహిళల అభ్యున్నతికి అనేక పథకాలు అమలు చేస్తున్నామని ఆమె స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే పేదల సంక్షేమాన్ని కోరే పార్టీ. ఇందిరమ్మ కాలంలోనే మహిళా సంక్షేమానికి పెద్దపీట వేశారు.

వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...

# రహదారి భద్రత పేరిట ప్రజలపైభారమా



హైదరాబాద్: పెరిగిపోతున్న ప్రమాదాల నివారణకు రహదారి భద్రతా చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశాలిస్తే వాటిని అమలు చేయాల్సింది పోయి, వాహన కొనుగోలుదారులపై భారం మోపడం దారుణమని కెటిఆర్ మండిపడ్డారు. ఇది ముఖ్యమంత్రి ప్రజావ్యతిరేక వైఖరికి నిదర్శనం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. రాష్ట్ర బడ్జెట్ నుంచి రోడ్ సేఫ్టీకి నిధులు కేటాయించి భద్రతా ప్రమాణాలను పెంచకుండా ఇలా అమాయక ప్రజలపై భారం మోపడం అత్యంత
దారుణం అని కేటీ-ఆర్ మండిపడ్డారు. హైడ్రా వంటి దిక్కుమాలిన విధానాలతో ప్రభుత్వ ఆదాయాలకు గండికొట్టి, ఇప్పుడు ఆ లోటు-ను పూడ్చలేక సామాన్య ప్రజలపై విరుచుకుపడటం దుర్మార్గమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రహదారి భద్రతా సెస్ పేరిట ఒక్కో కొత్త వాహనం కొనుగోలుపై ఏకంగా రెండు నుంచి పదివేల వరకూ అదనపు భారం వేయడం పేద, మధ్యతరగతికి చెందిన ప్రజానీకాన్ని దగా చేయడమే అని నిప్పులు చెరిగారు. రెండేళ్లు కావస్తున్నా ఇవ్వాల్సిన గ్యారెంటీ-లను గాలికొదిలేసి, చివరికి ప్రజల నుంచే ముక్కుపిండి రూ.270 కోట్లు- వసూలు చేసే కుట్రచేస్తే కాంగ్రెస్ సర్కారును ప్రజలు క్షమించరు. పైసా పైసా కూడబెట్టు-కుని, అప్పు చేసి మరీ వాహనం కొనుగోలు చేసే వారి జేబులు కొట్టే ఇలాంటి పన్నాగాలకు కాంగ్రెస్ సర్కారు ఇకనైనా స్వస్తి పలకాలి అని కేటీఆర్ పేర్కొన్నారు.

## ఓట్ల చోరీకి..బోగస్ ఓట్లకు తేడా తెలియదు



హైదరాబాద్: రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి ఫోబియా పట్టుకుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామ చందర్ రావు మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం చేయాల్సిన పనులు చేయకుండా ప్రతి విషయంలో కేంద్రపై నెపం వేస్తోందన్నారు. అధికారుల కొరతతో పాలనలో శూన్యత నెలకొంది. గ్రూప్ వన్ సమస్యతో సెలెక్ట్ అయినవారూ, కాలేని వారూ బాధపడుతున్నారని అన్నారు. రాష్ట్ర రాజకీయాలు, పాలన, జాతీయ పరిణామాలపై రామ చందర్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి పాలనపై విమర్శలు చేస్తూనే, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై కూడా తీవ్రంగా విరుచుకుపడ్డారు. రామ చందర్ రావు మాట్లాడుతూ.. శ్యామ్ పిట్రోడా ఇచ్చిన ట్రైనింగ్ కారణంగా రాహుల్ గాంధీ ఈ స్థితికి వచ్చారు. ఇప్పుడు 'ఓట్ల చోరీ' అనే కొత్త నాటకాన్ని తెరపైకి తెచ్చి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. వాస్తవానికి ఓట్ల చోరీ ఏదీ లేదు. బోగస్ ఓట్లు- మాత్రం ఉన్నాయి. బోగస్ ఓట్లు- వేరు, ఓట్ల చోరీ వేరు. ఈ తేడా కూడా తెలియని రాహుల్ గాంధీ ఒకసారి ఓట్ల చోరీ అంటారు, ఇంకోసారి హైడ్రోజన్ బాంబ్ అంటారని ఎద్దేవా చేశారు. అంతేకాకుండా.. 'సిబిఐ మీద మాకు నమ్మకం ఉంది. ప్రభుత్వం రాసిన లెటర్ ఇప్పటికే సిబిఐ
ముందుంది. కఉ-ూఅ ఇచ్చిన రిపోర్ట్ ఆధారంగానే పీసీ ఘోష్ విచారణ చేపట్టారు. అయితే ఆ విచారణలో నిందితులు ఎవరు అన్నది తేల్చారా? విచారణ తర్వాత రాజకీయ నాయకులను ఎవరినైనా అరెస్ట్ చేశారా?' అని ప్రశ్నించారు. 'టె-ర్రరిజం, లెఫ్ట్ -టె-ర్రరిజం రెండూ ఒక్కటే. మావోయిస్టులతో చర్చలు అనేక సార్లు జరిగాయి. కానీ ఆ చర్చల వల్ల హింస తగ్గలేదు, పెరిగింది. హింస పెరగడం వల్లే ఆపరేషన్ కగార్ ముందుకు వచ్చింది. మావోయిస్టులతో చర్చలు జరపాలా వద్దా అన్నది కేంద్ర ప్రభుత్వం నిర్ణయిస్తుంది' అని స్పష్టం చేశారు.

## తిరుమల శ్రీవారికే శఠగోపం



అమరావతి: వైకాపా గజదొంగలు శ్రీవారి సొత్తూ దోచుకున్నారు. వందకోట్ల పరకా'మనీ' దొంగ వెనుక ఆ పార్టీ నేతలు ఉన్నారని మంత్రి నారా లోకేశ్ ధ్వజమెత్తారు. శ్రీవారిని కూడా దోపిడీ చేయడం దుర్మార్గమని అన్నారు. ఈ మేరకు వీడియోను 'ఎక్స్' ఖాతాలో పోస్టు చేశారు. జగన్ ఐదేళ్ల పాలనలో అవినీతి రాజ్యమేలింది. అరాచకం పెచ్చరిల్లింది. దొంగలు, దోపిడీదారులు, మాఫియా డాన్లకు ఏపీని కేరాఫ్ అడ్రస్ మార్చారు. గనులు, భూములు, అడవులు, సమస్త వనరులతోపాటు- జనాన్ని దోచుకున్న జగన్ గ్యాంగ్.. చివరకు తిరుమల శ్రీవారి సొత్తునూ వదల్లేదు. తాడేపల్లి ప్యాలెస్ ఆశీస్సులు, నాటి తితిదే ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి అండదండలతో తిరుమల పరకామణిలో దొంగలు పడ్డారు. రూ.కోట్ల విలువైన సొత్తు కొల్లగొట్టారు. ఆ డబ్బులు రియల్ ఎస్టేట్‌లో పెట్టు-బడులు పెట్టారు. తిరుపతిలో భూమన నుంచి తాడేపల్లి ప్యాలెస్ వరకు వాటాలు అందాయని నిందితులే చెబుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా భక్తులు ఎంతో నమ్మకంతో కట్టిన ముడుపులు, హుండీలో వేసిన కానుకలు రూ.వందల కోట్లు- రవికుమార్ దోచుకుని వెళ్లినప్పుడు తితిదే ఛైర్మన్‌గా ఉన్న భూమన కరుణాకర్ రెడ్డి.. అతడి మనుషులు ఏకంగా ఈ కేసును లోక్ అదాలత్‌లో రాజీ చేయడానికి యత్నించారు. అధికార అండతో జగన్ గ్యాంగ్ శ్రీవారికి చేయని అపచారం లేదు. భక్తులు మహా ప్రసాదంగా భావించే లడ్డూను కల్తీ చేశారు. అన్న ప్రసాదాన్ని భ్రష్టు పట్టించారు. తిరుమల దర్శనాలను అమ్మేసి సామాన్య భక్తులకు స్వామివారి దర్శనం
దుర్లభం చేశారు. ఏడుకొండల జోలికి వెళ్లొద్దు, శ్రీవారికి అపచారం తలపెట్టవద్దని.. నాడు చంద్రబాబు బతిమాలి చెప్పినా జగన్ వినలేదు. ఏడుకొండలవాడు చాలా పవర్ ఫుల్ సామి. ఆయనకు అపచారం తలపెట్టినా, ఆయన సన్నిధిలో అవినీతికి పాల్పడినా.. ఏం జరుగుతుందో తెలిసికూడా జగన్, భూమన ఏకంగా పరకామణినే దోచేశారు. గుడిలో హుండీని దోచేసిన పాపాలతో జగన్ గ్యాంగ్ పాపం పండింది. పరకామణి వీడియోలు ఈరోజు బయటపడ్డాయి. నిందితులే వైకాపా పాపాల చిట్టా విప్పబోతున్నారని లోకేశ్ పేర్కొన్నారు.

# విదేశాలపై ఆధారపడడమే పెద్ద తప్పు



బతుకుదాం. 140 కోట్ల మంది భవిష్యత్తును ఇతర దేశాల మీద వదిలేయబోం అని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ శనివారం గుజరాత్‌లో పర్యటించారు. ఈసందర్భంగా అక్కడ నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. మనకు ప్రధాన శత్రువులు ఎవరూ లేరని, కానీ.. విదేశాలపై ఆధారపడటమే మన ప్రధాన శత్రువు అని వ్యాఖ్యానించారు. హెచ్-1బీ వీసాల దరఖాస్తు రుసుమును అమెరికా లక్ష డాలర్లకు పెంచుతున్నట్లు- ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో మోదీ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించు కున్నాయి. నేడు భారత్ విశ్వబంధు స్ఫూర్తితో ముందుకుసాగుతోంది. ప్రపంచంలో మనకు ప్రధాన శత్రువులు ఎవరూ లేరు. మన అతిపెద్ద శత్రువు ఇతరదేశాలపై ఆధారపడటమే. దీన్ని మనం ఓడించాలి. విదేశాలపై ఎక్కువగా ఆధారపడితే.. దేశ అభివృద్ధి విఫలమవుతుంది. ప్రపంచ శాంతి, స్థిరత్వం, శ్రేయస్సు కోసం అత్యధిక జనాభా కలిగిన దేశం ఆత్మనిర్భర్‌గా మారాలి. ఇతరులపై ఆధారపడితే మన ఆత్మగౌరవం దెబ్బతింటుంది. భారతదేశ అభివృద్ధిని, భావితరాలను పణంగా పెట్టలేం' అని మోదీ పేర్కొన్నారు. ఈసందర్భంగా దేశం భరించాల్సిన నష్టాల్లో షిప్పింగ్ రంగం ఒకటని మోదీ పేర్కొన్నారు. 50 ఏళ్ల క్రితం మన దేశంలో తయారుచేసిన నౌకలనే మనం ఉపయోగించుకొనేవాళ్లమన్నారు. కానీ, కాంగ్రెస్ అధికారం లోకి వచ్చిన తరువాత ఆ రంగం పూర్తిగా నాశనమైందని ఆరోపించారు. వారి ప్రభుత్వ హయాంలో స్వదేశం లో నౌకల తయారీపై దృష్టిపెట్టకుండా విదేశీ నౌకలకు అద్దెలు చెల్లించేందుకే ప్రాధాన్యం ఇచ్చారని విమర్శించారు. అందువల్లే ఇప్పటికీ మన వాణిజ్యంలో 90 శాతం విదేశీ నౌకల పైనే ఆధారపడుతున్నా మన్నారు. ఇందుకుగాను మనం ఏటా రూ.6 లక్షల కోట్లు చెల్లిస్తున్నామని వెల్లడించారు. ఇది దేశ రక్షణ బడ్జెట్ కంటే ఎక్కువన్నారు. దీనికి ముందు భావ్‌నగర్‌లో రూ.34,200 కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులను మోదీ ప్రారంభించారు.

# భారతీయుల నెత్తిన ట్రంప్ మరో పిడుగు



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడిగా డోనాల్డ్ ట్రంప్ ఎన్నికైన నాటి నుంచి భారత్‌కు షాక్‌ల మీద షాక్‌లు తగులుతూనే ఉన్నాయి. ఇప్పటికే భారీ పన్నులతో భారత ఎగుమతులను దెబ్బకొట్టిన ట్రంప్.. తాజాగా అమెరికాలో ఉద్యోగం చేయాలనుకునే భారతీయు లకు గట్టి షాకిచ్చారు. హెచ్1బీ వీసా దరఖాస్తు రుసుమును భారీగా పెంచేశారు. హెచ్1బీ వీసా వార్షిక రుసుమును లక్ష డాలర్లుగా నిర్ణయిస్తూ కార్యనిర్వాహక ఉత్తర్వుపై శుక్రవారం సంతకం చేశారు. ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయం భారత్, చైనాలపై తీవ్ర ప్రభావం చూపనుంది. ఈ ఉత్తర్వు ప్రకారం ఇకపై అమెరికా వేదికగా పని చేస్తున్న కంపెనీలు విదేశీ నిపుణులను నియమించుకోవాలంటే ఇకపై ఏడాదికి లక్ష డాలర్లు చెల్లించాల్సిఉంటుంది. అమెరికాలో
హెచ్1బీ వీసాపై పని చేస్తున్న విదేశీ ఉద్యోగుల్లో దాదాపు 71 శాతం మంది భారతీయులే ఉంటారు. చైనీయులు 11.7 శాతం మంది ఉంటారు. అత్యంత నైపుణ్యం కలిగిన విదేశీ నిపుణులను నియమించుకునే వీలు కల్పిస్తూ 1990లో హెచ్1బీ వీసాను తీసుకొచ్చారు. ఈ వీసాను ఉపయోగించుకుని ఎంతోమంది విదేశీ నిపుణులు అమెరికాలోకి ప్రవేశించారు. హెచ్1బీ వీసాదారులకు లాటరీ విధానం ఉంది. ఈ వీసా కోసం దరఖాస్తు చేసేందుకు ముందుగా సాధారణ ఛార్జీలు చెల్లించాలి. లాటరీలో ఎంపికైతే అదనపు ఛార్జీలు చెల్లించాలి. ఏడాదికి 85 వేల వీసాలను అమెరికా లాటరీ విధానం ద్వారా జారీ చేస్తుంది. సాధారణంగా కంపెనీలే ఉద్యోగుల హెచ్1బీ వీసా ఛార్జీలను చెల్లిస్తుంటాయి. అయితే ప్రస్తుతం ఆ ఫీజును భారీగా పెంచేయడంతో కంపెనీలు పెను భారాన్ని ఎదుర్కోక తప్పదు. అమెరికాలో ఉద్యోగం చేద్దామని కలలు కంటున్న భారతీయులకు నిజంగానే ఇది పిడుగులాంటి వార్త. దీంతో కొత్త హెచ్1బీ వీసా విధానం భారత్‌తో పాటు-, చైనాపై తీవ్ర ప్రభావం చూపనుంది. ప్రతి హెచ్-1బీ వీసాపై ఏటా లక్ష డాలర్లు రుసుం విధించినట్లు- యూఎస్ కామర్స్ సెక్రటరీ హోవార్డ్ లుట్నిక్ ప్రకటనలో పేర్కొన్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే అన్ని పెద్ద కంపెనీలకు వివరించినట్లు- తెలిపారు. మీరు ఎవరికైనా శిక్షణ ఇవ్వదలుచుకుంటే ఇటీవల మన దేశంలోని గొప్ప యూనివర్సిటీల నుంచి పట్టభద్రులైన మన వారికి ఇవ్వండి. అమెరికన్లకు ట్రైనింగ్ ఇవ్వండి. మన ఉద్యోగాలను కొల్లగొడుతున్న వారిని ఇతర దేశాల నుంచి తీసుకురావడం ఆపండని లుట్నిక్ మీడియా సమావేశంలో పేర్కొన్నారు. ఈ నిర్ణయానికి టెక్నాలజీ రంగం మద్దతు ఇస్తుందని ట్రంప్ పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో వారు చాలా సంతోషిస్తారని తెలిపారు. ట్రంప్ నిర్ణయంపై దిగ్గజ టెక్ కంపెనీలు అయిన యాపిల్, గూగుల్, మెటా ఇంతవరకు స్పందించలేదు. 1990లో అత్యంత నైపుణ్యం కలిగిన విదేశీ నిపుణుల కోసం హెచ్-1బీ వీసా తీసుకొచ్చారు. హెచ్-1 బి వీసాలను మూడు నుంచి ఆరేళ్ల మధ్య కాలానికి మంజూరు చేస్తారు. దీంతో ఈ వీసాను ఉపయోగించుకొని ఎంతో మంది విదేశీ నిపుణులు అమెరికాలోకి ప్రవేశించి ఉన్నతోద్యోగాల్లో స్థిరపడ్డారు. మరోవైపు గోల్డ్‌కార్డును సైతం ట్రంప్ ప్రకటించారు. దీనికి 10 లక్షల డాలర్లుగా నిర్ణయించారు. దీని ద్వారా అమెరికాకు 100 బిలియన్ డాలర్లు సమకూరే అవకాశం ఉంది. పన్నుల తగ్గింపు, అభివృద్ధి ప్రాజెక్టులకు, రుణాల చెల్లింపులకు గోల్డ్‌కార్డు నిధులు వినియోగించనున్నట్లు ట్రంప్ తెలిపారు. ఈ సందర్భంగా అమెరికా కామర్స్ సెక్రటరీ హోవర్డ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. పనికిరాని వ్యక్తులు అమెరికా రావొద్దని, హెచ్1బి అప్లికేషన్ ఫీజు పెంచే సమయంలో ఘాటు- విమర్శలు చేశారు. ఐటి కంపెనీలు అమెరికన్లనే నియమించుకోవాలని, పనికి రాని వ్యక్తులను అమెరికాలోకి రావడాన్ని ఆపేయాల్సిందేనని హోవర్డ్ స్పష్టం చేశారు. హెచ్1బి వీసాలతో అమెరికా వెళ్లేది ఎక్కువగా భారతీయులే ఉండడంతో హోవర్డ్ వ్యాఖ్యలు వారినే అవమానించే విధంగా ఉన్నాయని నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# రణమా... శరణమా?

**సాయుధ పోరాటంపై మావోయిస్టు పార్టీలో భిన్నాభిప్రాయాలు**

**మావోయిస్టులకు డెడ్‌లైన్ విధించిన హోంమంత్రి అమిత్ షా**

**2026 మార్చి 31 తర్వాత సాయుధ పోరాటం ఉండేనా ?**

**సీపీఐ (మావోయిస్టు) ఏర్పాటై నేటితో 21 వసంతాలు పూర్తి**



భద్రాద్రి కొత్తగూడెం: సీపీఐ (మావోయిస్టు) పార్టీ ఏర్పడి ఆదివారం నాటికి 21 ఏళ్లు పూర్తవుతోంది. ఈ తరుణంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా చెప్పినట్టుగా 2026 మార్చి 31 నాటికి మావోయిస్టుల నిర్మూలన జరుగుతుందా లేక విప్లవ పోరాటం ఇంకా కొనసాగుతుందా? అసలు రాబోయే ఆరు నెలల్లో ఏం జరుగుతోందనే ఉత్కంఠ నెలకొంది. ఏకంగా సైన్యం ఏర్పాటు
ఉమ్మడి ఏపీ ప్రభుత్వంతో చర్చలు విఫలమైన వెంటనే దేశంలో సాయుధ విప్లవ పోరాటం సాగిస్తున్న పార్టీలన్నీ (ముఖ్యంగా పీపుల్స్‌వార్, మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్)లు ఏకమై 2004 సెప్టెంబర్ 21న భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)గా ఏర్పడ్డాయి. తెలంగాణకు చెందిన గణపతి తొలి చీఫ్‌గా ఎన్నికయ్యారు. ఈ మార్పుతో విప్లవ పోరాటాలు కొత్త బలం పుంజుకున్నాయి. 2009 నాటికి దేశంలో తొమ్మిది రాష్ట్రాల్లోని 200 జిల్లాల్లో ప్రభావం చూపించే స్థాయికి చేరుకున్నారు. పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ పేరుతో సొంత సైన్యం ఏర్పాటు చేసుకున్నారు. క్రమంగా ఈ ఆర్మీలోనే 12 వేల మంది సభ్యులు వచ్చి చేరారు. వీరికి అవసరమైన ఆయుధాల కోసం పోలీస్ క్యాంపులపై దాడి పెరిగింది. ఛత్తీస్‌గఢ్ %-% మహారాష్ట్ర %-% తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న అడవుల్లో జనతన సర్కార్ పేరుతో సమాంతర ప్రభుత్వాలను సైతం ఏర్పాటు చేశారు. ప్రధానినే కలవరపరిచారు.. పశుపతి టు తిరుపతి పేరుతో రెడ్ కారిడార్ ఏర్పాటు కోసం మావోయిస్టులు ఉద్యమించారు. దీంతో మావోయిస్టులు పురోగమిస్తున్న తీరు చూసి 'దేశానికి అంతర్గతంగా మావోయిస్టుల నుంచే అతిపెద్ద ప్రమాదం ఉంది'అని అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ 2009 అక్టోబర్ 11న వ్యాఖ్యానించారు. ఆ తర్వాత యాంటీ నక్సల్స్ ఆపరేషన్‌గా గ్రీన్‌హంట్ మొదలైంది. 2015 తర్వాత కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక ఆపరేషన్ సమాధాన్, ప్రహార్, 2024 జనవరిలో కగార్ (ఫైనల్ మిషన్) మొదలైంది. 2026 మార్చి 31 నాటికి దేశంలో మావోయిస్టులను సమూలంగా నిర్మూలిస్తామని హోంమంత్రి అమిత్‌షా ఇప్పటికే ప్రకటించారు. అన్నట్లుగా నే ప్రత్యేక శిక్షణ పొందిన దళాలను రంగంలోకి దించడంతో మావోయిస్టు పార్టీ తీవ్రంగా నష్టపోయింది. దీంతో శా%శీ%తి చర్చల ప్రతిపాదనను ఈ ఏడాది ఏప్రిల్‌లో మావోయిస్టులు తెరపైకి తెచ్చారు. ఇందుకు ప్రభుత్వం సుముఖంగా లేకపోవడంతో నిర్బంధం కొనసాగుతోంది. ఇటీవల వేర్వేరు ఎన్‌కౌంటర్లలో ఏడుగురు కేంద్ర కమిటీ సభ్యులు చనిపోయారు. ఇందులో ఆ పార్టీ చీఫ్ నంబాల కేశవరావు కూడా ఉన్నారు. సీపీఐ (మావోయిస్టు) ఒక దశనే..
పెరిగిన నిర్బంధంతో ఆ పార్టీకి మిగిలిన ముగ్గరు పొలిట్‌బ్యూరో సభ్యుల్లో ఒకరైన మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ సోను ఏకంగా ఆయుధాలు వదిలేసి లీగల్ పోరాటానికి సిద్ధమంటూ లేఖ జారీ చేశారు. కానీ, సోను లేఖ ఆయన వ్యక్తిగత అభిప్రాయమని, సాయుధ పోరాటం కొనసాగుతుందని పార్టీ స్పష్టంచేసింది. వెరసి విప్లవ పోరాటం దశదిశ ఏంటనే ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. అయితే, సాయుధ రైతాంగ పోరాటం, నక్సల్బరీ ఉద్యమం, పీపుల్స్‌వార్ పార్టీలు ఎదుర్కొన్న దశనే ప్రస్తుతం మావోయిస్టు పార్టీ ఎదుర్కొంటోందనే వాదనలు వినిపిస్తున్నాయి. చర్చలు జరిపినా, ఆయుధాలెక్కుపెట్టినా విప్లవ పంథా మారదని మేధావులు అంటున్నారు. సమాజంలో పీడకులు, పీడితులు ఉన్నంత వరకు వర్గపోరాటం కొనసాగుతుందని అంటున్నారు. ఇందులో మావోయిస్టుల పోరాటం కేవలం ఒక దశనే అని వారు చెబుతున్నారు.

# నేటినుంచి బతుకమ్మ సంబరాలు



నిజామాబాద్: మానవుడి జీవితంతో ముడిపడి ఉన్న ప్రతి వస్తువును ఆరాధనగా చూసి ప్రేమించి పూజించడం మన వారసత్వానికి నిదర్శనం. అందుకే ఆకాశం,నీరు,గాలి, నిప్పు, భూమిలనుపంచభూతాలుగా పూజిస్తున్నాం. మనజీవన విధానం అంతా కూడా ప్రకృతితో మమేకమై ఉంది. ప్రకృతి ఆరాధన అన్నది భారతీయ సంస్కృతితో పెనవేసుకుని ఉంది. పుట్టలను,చెట్లను, పూలను పూజించే గొప్పతనం మనది. దేవీ నవరాత్రులు, బతుకమ్మ పండగలు ఈ కోవలోకే వస్తాయి. ప్రకృతిని పూజించే మహత్తరమైన వేదికలు ఇవి. ఆదివారం నుంచి బతుకమ్మ ఉత్సవాలు, సోమవారం నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ రెండూ కూడా అమ్మవారిని పూజించే పండుగలే. తెలంగాణలో బతుకమ్మకు ఉన్న ప్రత్యేకతే వేరు. ప్రకృతి రమణీయకతకు బతుకమ్మ నిదర్శనం. ఇదో రకంగా గౌరీపూజను చేయడం.. అమ్మవారికి శరన్నవరాత్రులు ఎలా జరుపుతామో తెలంగాణాలో 9రోజులపాటు బతుకమ్మ వేడుకలను అలా జరపడం ఆనవాయితీ. ఈ 9 రోజుల్లో కూడా తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి మహిళలంతా గుమిగూడా ఆడుకోవడం...ఆడపిల్లలను ఇంటికి రప్పించి వేడుక చేయడం పెద్ద సరదా. తెలంగాణ లోగిళ్లలో కులాలకు అతీతంగా బతుకమ్మను పెద్ద ఎత్తున ఆడుతారు. తొమ్మిది రోజుల బతుకమ్మ వేడుకలు, నవర్రాతుల దేవీ పూజలతో అంతటా సందడి కనిపించనుంది. రంగురంగుల పుష్ప సౌందర్యాల హంగులతో సింగారించు కొనే బంగరు కల్పవల్లిగా బతుకమ్మను తెలంగాణవాసులు భావిస్తారు. ఓ పళ్లెంలో
గుమ్మడి ఆకులు పరచి, వాటిని పసుపు కుంకుమలతో అలంకరిస్తారు. ముందుగా గుమ్మడి పువ్వుల్ని అమర్చి- అక్కడే తంగేడు, బీర, గన్నేరు, నిత్య మల్లె, బంతి వంటి పుష్పాల్నిపేర్చి కూర్చడం కళాత్మకంగా చేస్తారు. అదే పువ్వుల దొంతరపై తమలపాకులో పసుపు గౌరమ్మను అలంకరిస్తారు. ఆ పుష్ప సముదాయాన్నే బతుకమ్మగా వ్యవహరిస్తారు. మహిళలు లయాత్మకంగా అడుగులు వేస్తూ, చుట్టూ ప్రదక్షిణ చేస్తారు. బతుకమ్మ ఆవిర్భావం, గౌరీదేవి లీలలు, సామాజిక జీవన రీతులు, కుటుంబాల అనుబంధాలు, పురాణగాథలు, ఇతిహాస ఘట్టాల్ని వారు పాటల రూపంలో ఆలపిస్తారు. పసుపుబొట్టు పేరిట తాంబూలాలు ఇచ్చి పుచ్చుకొంటారు. బతుకమ్మను పసుపు, కుంకుమలతో ఆరాధించి వివిధ రకాల పదార్థాల్ని నివేదన చేస్తారు. ఆటపాటల అనంతరం, ప్రతి నిత్యం జలాశయాల్లో నిమజ్జనం చేయడం ఈ సంప్రదాయంలో ఒక భాగం. ప్రకృతి స్వరూపిణిగా అమ్మవారిని భావించి, వివిధ పుష్పాలతో పేర్చి 'బతుకమ్మ'గా ఆరాధిస్తారు. బతుకమ్మగా పిలిచే గౌరమ్మ అయినా, దేవీరూపాలలోని పదుగురు అమ్మలయిన లలితాదేవి, అన్నపూర్ణ, రాజరాజేశ్వరి, పార్వతి, మహాలక్ష్మి, గాయత్రి, సరస్వతి, దుర్గ, మహిషాసురమర్దని, అపరాజితాదేవి అందరూ పరాశక్తికి చెందిన ప్రధాన, ఉపప్రధాన, అంశాత్మక స్వరూపాలేనని మన పురాణాలు చెబుతు న్నాయి. భూమిమీది మట్టి, చెట్టు, నీరు, నిప్పులలోనే కాదు, గ్రామగ్రామాన వెలసిన ఎల్లమ్మ, బాలమ్మ, పోలేరమ్మ, పెద్దమ్మలు.. వంటి అమ్మలంతా ఆమెకు ప్రతీకలు, ప్రతిరూపాలే. ఇంతేనా, సమస్త సృష్టికే ఆమెనే మూలం.మహాలయ అమావాస్య నుంచి మహర్నవమి వరకు సాగే ఈ ఉత్సవం తెలంగాణ సాంస్కృతిక సౌరభాల్ని వెదజల్లుతుంది.అందుకే మన జీవన విధానం, సామాజిక ఏకత్వానికి మన పండుగలు ప్రతీకలుగా నిలుస్తున్నాయి. జాతి చరిత్రకు, సంస్కృతికి, సంప్రదాయ వైభవానికి ఈ ఉత్సవాలు ఉపకరిస్తున్నాయి. తెలంగాణకు మాత్రమే ప్రత్యేకమైన బతుకమ్మ పండగలో ప్రకృతి ఆరాధనతో పాటు
కుటుంబ కట్టుబాటు, ఆచారాలు ఇమిడి ఉన్నాయి. సంఘంలో క్రమశిక్షణకు, వ్యక్తుల ఆధ్యాత్మిక సరళికి ఇవి దోహదం చేస్తున్నాయి. ఈ పరంపర లోకే ఆశ్వయుజ మాసంలో నిర్వహించే శరన్నవరాత్రులు కూడా వస్తాయి. ఆటపాటల నేపథ్యంగా, నిత్య జీవన రీతికి అనుగుణంగా ఈ సంబరాల్ని కొనసాగిస్తారు. ప్రాణశక్తి, ప్రాణధాత్రి, ప్రాణేశ్వరి అనే ఆదిశక్తి నామాలకు ప్రతిబింబం. బతుకమ్మ అంటే బతుకునివ్వడంతో పాటు, సకల ప్రాణులకూ జీవశక్తిని అందజేసే ప్రకృతి, ఆకృతి- బతుకమ్మ. తొమ్మిది రోజులపాటు బతుకమ్మ సందడి విలసిల్లుతుంది. పూర్ణత్వానికి సంకేతం- తొమ్మిది. నవ విధ భక్తి మార్గాలకు, నవ నిధులకు ప్రతిబింబంగా బతుకమ్మను తొమ్మిది రకాల పుష్పాలతో తొమ్మిది వరసల్లో అమరుస్తారు. ఈ తొమ్మిది రోజుల్లో- మొదటి, రెండో రోజుల్లో బొడ్డెమ్మగా, మూడో రోజు లక్ష్మీదేవిగా, నాలుగో రోజు గౌరమ్మగా ఆరాధిస్తారు. అయిదో రోజు అట్ల బతుకమ్మగా, ఆరో రోజు అలిగిన బతుకమ్మగా, ఏడో రోజు చకినాల బతుకమ్మగా, ఎనిమిదో రోజు దుర్గమ్మగా, తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మగా ఆరాధించడం సంప్రదాయం. తొమ్మిది రోజులూ గౌరీదేవి 'పూలమ్మ'గా పుట్టింటికి తరలి వచ్చినట్లు భావిస్తారు. తమ ఇంటి ఆడబిడ్డగా బతుకమ్మను భావిస్తూ, ఆరాధన చేస్తారు. తొమ్మిదో రోజున సద్దుల బతుకమ్మకు సాగనంపు వేడుక నిర్వహిస్తారు. గౌరమ్మను అత్తవారింటికి- అంటే, శివుడి వద్దకు పంపుతూ, సకల సౌభాగ్యాలూ అనుగ్రహించడానికి మళ్లీ తరలిరమ్మని వేడుకుంటారు. ప్రకృతి నుంచి ఆవిష్కృతమైన పూల పుంత బతుకమ్మ. జలాల్లో సమ్మిళితమై, చివరికి ఆ ప్రకృతిలోనే మమేకమవుతుంది. పూలతో బతుకమ్మ ఆవిర్భవించడం, ఆటపాటలతో అలరింతగా వేడుక చేయడం, నిమజ్జనంతో అనంత ప్రకృతిలో సంలీనం కావడం అనేవి- జగన్మాత సృష్టి, స్థితి, లయాత్మక తత్వాలకు సంకేతాలుగా భావించాలి. నవరాత్రుల్లో చేసే
చక్రార్చనకు మరో రూపమే బతుకమ్మ ఆరాధన. ఇచ్ఛాశక్తి, క్రియాశక్తి, జ్ఞానశక్తుల సమ్మేళన రూపం ఆమె. 'ప్రకృతిని పూజించండి, పరిరక్షించండి. ఆ ప్రకృతే మిమ్మల్ని రక్షిస్తుంది' అనే సామాజిక ఆత్మీయ సందేశాన్ని బతుకమ్మ అందిస్తుంది.

వేగుచుక్క
సీనియర్ జ్వలం గొంతుక...

# పట్టణీకరణ పెరుగుతున్న.. అభివృద్ధి శూన్యం.

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధుల కేటాయింపుల్లో నిర్లక్ష్యం.**

**పన్నులు వేస్తున్న కనీస మౌలిక సదుపాయాలు కల్పనలో అలసత్వం.**

**తెలంగాణ అర్బన్ డెవలప్మెంట్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ ఎం. శ్రీనివాస్.**

**నిజామాబాద్ నగర అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో చర్చా కార్యక్రమం.**



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**

రాష్ట్రంలో పట్టణీకరణ పెరుగుతున్న అభివృద్ధి మాత్రం శూన్యం అని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధుల కేటాయింపుల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయనీ, ప్రజలపై అనేక రకాల పన్నులు వేస్తున్న కనీస మౌలిక సదుపాయాలు కల్పనలో అలసత్వం ప్రదర్శిన్నాయని తెలంగాణ అర్బన్ డెవలప్మెంట్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ ఎం. శ్రీనివాస్ ధ్వజం ఎత్తారు. వర్షపు నీటిని తట్టుకునేలా డ్రైనేజీ వ్యవస్థ ఉండాలనీ, కుండపోతగా కురుస్తున్న వర్షాలను తట్టుకునేలా డ్రైనేజీ వ్యవస్థ లేదని దీని మూలంగా నగరాలు పట్టణాలు మినీ వాటర్ బండ్ ల మారిపోయి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. శనివారం నిజామాబాద్ నగర అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శనివారం పెన్షనర్స్ భవన్లో జరిగిన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు, మున్సిపాలిటీలన్నీ స్థానిక పట్టణ ప్రభుత్వాలే, ఈ స్థానిక ప్రభుత్వాలకు విధులతోపాటు తగినన్ని నిధులు కూడా కేటాయించాలనీ, కేరళ రాష్ట్రంలో మాదిరిగా పట్టణ స్థానిక సంస్థలను స్వతంత్రంగా పనిచేసేలా అధికారాలు, నిధులు ఇవ్వాలని ఆయన అన్నారు. ఇటీవల వర్షాలు, వరదల కారణంగా అనేక నగరాలు పట్టణాలు తీవ్రంగా దెబ్బతిన్నాయనీ, పట్టణాల్లో వరద నీటి డ్రైనేజీ వ్యవస్థ సరిపడ లేకపోవడం కొన్ని పట్నాలకు అసలే డ్రైనేజీలు లేకపోవడం తీవ్ర సమస్యగా మారిందన్నారు. వరదలను తట్టుకునేలా పట్టణాలను నిర్మించాల్సిన అవసరం ఉందని దీనిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశంలో 100 నగరాలను ఎంపిక చేసుకొని స్మార్ట్ సిటీలుగా అభివృద్ధి చేస్తామని దశాబ్ద కాలం క్రితం ప్రకటించిందనీ, నేటికీ ఒక్క నగరం కూడా స్మార్ట్ సిటీగా మారలేదనీ, చిన్నపాటి వర్షం వస్తే తట్టుకునే స్థితి లేదు, ఇవేమీ స్మార్ట్ సిటీలు అని ఆయన ప్రశ్నించారు.

పట్టణాల అభివృద్ధికి తయారు చేస్తున్న మాస్టర్ ప్లాన్లు వాస్తవ పరిస్థితి కనుగునంగా, ప్రజల సమస్యలు పరిష్కరించేలా లేవనీ కన్సల్టెన్సీల జేబులు నింపడానికి పనికి వస్తున్నాయనీ ఆయన అన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే మాస్టర్ ప్లాన్లు తయారు జరగాలనీ ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అవినీతి కూడా తారాస్థాయిలో పెరుగుతున్నది, అభివృద్ధి పనులు పూర్తిగా నాణ్యత కొరవడి కుప్ప కూలిపోతున్నాయి, అవినీతికి వ్యతిరేకంగా నగరా ప్రజానీకం ఐక్యంగా కదలాలన్నారు. ఆకుల ప్రసాద్ అధ్యక్షత వహించిన ఈ సభలో కార్యదర్శి కే. రామ్మోహన్ రావు, షేక్ హుస్సేన్, మల్లేష్ రెడ్డి, సబ్బని లత, ఈవీఎల్ నారాయణ, సాదుద్దీన్, జి. నరేందర్, నాగయ్య తదితరులు మాట్లాడారు.




# ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశ పెట్టాలి.

- పిడిఎస్ యూ నాయకుల డిమాండ్.

**వేగుచుక్క న్యూస్, డిచ్ పల్లి:** రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఇంటర్ జూనియర్ కళాశాలలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశ పెట్టాలని పిడిఎస్ యూ నాయకులు వరుణ్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోనీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని పెట్టాలని ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ, గ్రామాలలో ఉండే పేద మధ్య తరగతి విద్యార్థులు అత్యధికంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో చదువుకుంటున్నారని, చాలామంది విద్యార్థులు మధ్యానం హెూటల్లో తింటున్నారని, మరికొందరు పస్తులు ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన బస్ చార్జీలే కాకుండా అదనపు ఆర్థిక భారం భరిస్తున్నారని, సంక్షేమ పథకాల కోసం కోట్లు కేటాయిస్తున్నారు కానీ పేద విద్యార్థులు చదువుకునే కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పెట్టటం లేదని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే మధ్యాహ్న భోజన పథకాన్ని పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ యూ నాయకులు యశ్వంత్, సాయి కిరణ్, వినీల్, శ్రవణ్, రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# దేవిమాత మండపాలకు "ధన్ పాల్ ట్రస్ట్" పట్టుచీరాల పంపిణీ.



**పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ.**

**నగరంలోని దాదాపు 250 మండపాలకు..**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**

దేవిమాత మండపాలకు ధన్ పాల్ లక్ష్మీబాయ్ అండ్ విఠల్ గుప్తా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టుచీరాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్, అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ శనివారం మార్వాడి గల్లీ డి ఎస్ ఎన్ కార్యాలయంలో ఈ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు దేవి నవరాత్రుల సందర్భంగా ఇందూర్ నగరంలోని దాదాపు 250 మండపాలకు పట్టుచీరలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. గత 11 ఏళ్ల నుండి తన ట్రస్ట్ ద్వారా ఈ సేవ కార్యక్రమాలతో పాటు హిందూ పండుగలకు తమ వంతు సహకారం అందించడం జరుగుతుందన్నారు. హిందూ ధర్మంలో శరన్నవరాత్రి పండుగకు ప్రత్యేక ప్రాముఖ్యత ఉందన్నారు, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలసి ఈ పండుగను జరుపుకుంటారని అన్నారు. దుర్గా దేవి, మహిషాసురుడనే రాక్షసునితో 9 రాత్రులు యుద్ధము చేసి అతనిని వధించిన సందర్భంగా ఈ పండుగను దుర్గాదేవికి అంకితం చేయబడిందని అన్నారు. హిందూ బంధువులు ఆడపడుచులు అంత ఐక్యతతో, భక్తి శ్రద్ధలతో నిర్వహించే దేవి నవరాత్రులకు తమ వంతు సహకారం అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. హిందూ ధర్మరక్షణకు, హిందూ సంస్కృతి, సంప్రదాయాలను పెంపొందించడానికి ప్రతి కార్యానికి తన ట్రస్ట్ ద్వారా సేవాలాందించడానికి ముందుంటమన్నారు, అమ్మ ఆశీర్వాదం ఉంటే అన్ని ఉన్నట్లే అని రాష్ట్ర ప్రజలందరు సుఖసంతోషాలతో, ఆయురా రోగ్యాలతో ఉండాలని రైతన్నలు సకాలంలో వర్షాలు కురిసి అధిక పంటలు పండించి సుభిక్షంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ రాజావెంకట్ రెడ్డి, ధన్ పాల్ లక్ష్మీబాయి %ಆ% విఠల్ గుప్త ట్రస్ట్ సభ్యులు ఉదయ్ కుమార్, ప్రణయ్ కుమార్, బిజెపి నాయకులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# ప్రెస్ క్లబ్ కు "యశోద హాస్పిటల్" 50 చైర్లు వితరణ.




**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్:**

ప్రెస్ క్లబ్ అవసరాల కోసం యశోద హాస్పిటల్ హైటెక్ సిటీ, హైదరాబాద్ వారు 50 ప్లాస్టిక్ చైర్స్ శనివారం బాధ్యులకు అందించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ పీఆర్వో మధుని ప్రెస్ క్లబ్ తరఫున సన్మానించి, ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కార్యదర్శి బైర శేఖర్, కార్యవర్గ సభ్యులు ప్రమోద్ గౌడ్, వీడియో జర్నలిస్ట్ ప్రెసిడెంట్ నగేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి: సాందీపని కళాశాలలో శనివారం నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న విద్యార్థినులు..**

# కొత్త పార్టీ ఏర్పాటుపై కవిత ఇంట్రెస్టింగ్ కామెంట్స్

**తెలంగాణ:** బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ అయిన కవిత కొత్త పార్టీ ఏర్పాటుపై కీలక కామెంట్స్ చేశారు. తనతో చాలా మంది నేతలు టచ్లో ఉన్నారని అన్నారు. కేసీఆర్ కూడా పార్టీ పెట్టే ముందు వందల మందితో చర్చించారని.. తాను కూడా అదే పని చేస్తున్నట్లు వెల్లడించారు. కాంగ్రెస్ సహా ఏ పార్టీలో చేరే ఉద్దేశ్యం లేదని అన్నారు. ప్రస్తుతం ఫ్రీ బర్డ్లా ఉన్నానని ఆమె స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్ల సమస్య తన మనసుకు దగ్గరైందని.. ఏ వర్గానికో కాకుండా ప్రజలందరి కోసం పని చేయాలనుకుంటు న్నానని పేర్కొన్నారు. 'నేను ఇప్పుడు ఫ్రీ బర్డ్.. నాకు అన్ని ద్వారాలా తెరిచే ఉన్నాయి. చాలా మంది పెద్దలు నన్ను వచ్చి కలుస్తున్నారు. నాతో టచ్లో ఉన్న బీఆర్ఎస్ నేతల లిస్టు చాలా పెద్దది. తండ్రి పార్టీ నుంచి సస్పెండ్ అయిన మొదటి కూతుర్ని నేను. టీఆర్ఎస్ పార్టీ పెట్టే ముందు కేసీఆర్ గారు వందల మంది మేధావులతో కలిసి చర్చించారు. నేను కూడా అదే చేస్తున్నా. కాంగ్రెస్ పార్టీలో చేరే ఆలోచన మాత్రం లేదు. కాంగ్రెస్ పెద్దలు ఎవరూ నాకు ఫోన్ చేయలేదు. నేను ఎవర్ని అప్రోచ్ కాలేదు.. సీఎం రేవంత్ నా పేరు ఎందుకు తీసుకున్నారో తెలియదు. ముఖ్యమంత్రే కాంగ్రెస్ పార్టీ వీడి వెళ్లిపోతున్నారేమో.

ఓ వర్గం కోసం కాదు ప్రజలందరి కోసం పని చేయాలని అనుకుంటున్నా. బీసీ రిజర్వేషన్ల సమస్య నా మనసుకు దగ్గరైంది. ఇరిగేషన్ శాఖ విషయంలో 2016లోనే నేను కేటీఆర్ గారిని అలెర్ట్ చేశా. కాళేశ్వరంలో ప్రాజెక్టు నిర్ణయం మొత్తం కేసీఆర్దేనని హరీష్ రావు పీసీ ఘోష్ కమిషన్ ఎదుట చెప్పారు. హరీష్ రావుపై కాళేశ్వరం విషయంలో తప్పు.. మరో విషయం లో కోపం లేదు.' అని కవిత ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు.

గ్రూప్ 1 అంశంలో రేవంత్ సర్కార్ తీరుపై మండిపడ్డారు. గ్రూప్ 1 పరీక్షల విషయంలో ముఖ్య మంత్రి రేవంత్ హైకోర్టు డివిజన్ బెంచ్, సుప్రీం కోర్టుకు వెళ్లాలని భావించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ చర్యల ద్వారా రాష్ట్రంలో భవిష్యత్తులో గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3 నోటిఫికేషన్లు ఆగిపోతా యనే ఆలోచన ప్రభుత్వం చేస్తోందని ఆమె ఆరోపించారు. అదే సమయంలో, బీసీ రిజర్వే షన్ల బిల్లు గవర్నర్ వద్ద పెండింగ్లో ఉన్నప్పటికీ.. ప్రభుత్వం ఆ విషయంపై సుప్రీం కోర్టుకు వెళ్లడానికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని కవిత విమర్శించారు. నిరుద్యోగులు, విద్యార్థు లకు సంబంధించిన కీలక అంశాలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరి స్తోందని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.



వేగుచుక్క

# నలంద"లో ఘనంగా "బతుకమ్మ" సంబరాలు.









**ఆటపాటలతో ఉత్సాహంగా పాల్గొన్న టీచర్లు, విద్యార్థినులు.**

**పండుగ విశిష్టతను వివరించిన పాఠశాల యాజమాన్యం ప్రసాద్, సాగర్.**

**వేగుచుక్క న్యూస్, ఆర్మూర్:**

పట్టణంలోని మామిడిపల్లి లో గల నలంద పాఠశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు మొదట బతుకమ్మలను ఊరేగింపుగా తీసుకొని వచ్చి బతుకమ్మకు పూజా కార్యక్రమం నిర్వహించారు. బతుకమ్మలను పాఠశాల మైదానంలో ఉంచి ఉపాధ్యాయుని, విద్యార్థులు అందరూ కలిసి ఆటపాటలతో బతుకమ్మ నృత్యాలు చేశారు. పాఠశాల యజమాన్యం అయిన కరస్పాండెంట్ ప్రసాద్, ప్రిన్సిపాల్ సాగర్ బతుకమ్మ పండుగను తొమ్మిది రోజులు ఎలా జరుపుకుంటారు, బతుకమ్మ పేర్లను, వాటి ప్రాముఖ్యతని విద్యార్థులకు తెలియజెప్పారు. తదుపరి బతుకమ్మని ఊరేగింపుగా తీసుకొని చెరువు వద్ద నిమజ్జనం చేశారు. ఈ బతుకమ్మ వేడుకల్లో ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొని పండుగ వాతావరణాన్ని మరింత సందడిగా మార్చారు. నలంద పాఠశాల నిర్వహించిన ఈ కార్యక్రమం సాంస్కృతిక వారసత్వాన్ని ప్రోత్సహించడంలో భాగంగా గొప్పగా నిర్వహించారు.






# ఆర్కిడ్స్"లో అంబరాన్నంటిన "బతుకమ్మ" సంబరాలు.









**తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించేలా వేడుకలు.**

**పాఠశాల ప్రాంగణం అంతా పండుగ వాతావరణం.**

**పాల్గొన్న పాఠశాల చైర్మన్ అండ్ ప్రిన్సిపాల్ సిహెచ్ గోవర్ధన్ రెడ్డి.**

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి:**





పట్టణంలోని ప్రముఖ "ఆర్కిడ్స్ ఉన్నత పాఠశాల"లో శనివారం నిర్వహించిన బతుకమ్మ వేడుకలు అంబరాన్నంటాయి. విద్యార్థినులు, ఉపాధ్యాయునిలు రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి, సాంప్రదాయ పాటలతో సందడి చేశారు. ఈ వేడుకలో విద్యార్థులు తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించేలా పాటలు పాడుతూ, బతుకమ్మను చుట్టూ తిరిగి ఆనందంగా ఆటపాటలతో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ అండ్ చైర్మన్ సిహెచ్. గోవర్ధన్ రెడ్డి, డైరెక్టర్ మర్రి సదాశివ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ భూలక్ష్మి, అకాడెమిక్ ఇన్చార్జ్ వసంత పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా పాఠశాలప్రిన్సిపల్ అండ్ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ అనేది తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలుస్తుందని, విద్యార్థులు ఇలాంటి సాంప్రదాయ పండుగలలో పాల్గొని విలువలను తెలుసుకోవాలని సూచించారు. అనంతరం బొడ్డెమ్మలను నీళ్లలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఎంతో ఉత్సాహంగా బతుకమ్మను పండుగ వేడుకలలో పాల్గొన్నారు.